# ఒక దీపం వెలిగింది

**బండారు పురుషోత్తం**

ఆ రోజు ఆదివారం. ప్రెస్‌క్లబ్‌లో వారపత్రిక పేజీలు తిరగేస్తున్నాను. విసుగుపుట్టింది. ఒక మూలగావున్న కుర్చీలో ఒంటరిగా కూర్చున్నాను. నా జేబులోని చిన్నసైజు పుస్తకం తీసి, తోచింది వ్రాసుకుంటున్నాను. ఎక్కడో చిన్న పాటి స్వరం "సుందరంగారూ" అంటూ పిలవడం వినిపించింది. నన్నేననుకుంటూ... ఎవరా? అని ఆ స్వరాన్ని గుర్తుపట్టడానికి ప్రయత్నించాను. ప్రకాశం నన్ను పిలుస్తున్నాడు. అతని గొంతు గుర్తుపట్టాను. ఆయన మేడమీద గది నుంచి దిగివస్తూ నన్ను పిలుస్తున్నారు. నేను బదులివ్వడానికి గొంతు విప్పేంతలో తనే నా దగ్గరకు వచ్చేశాడు. "సుందరంగారూ, మీ కోసం ఒక వ్యక్తి మీ చిరునామా పట్టుకొని ఉదయం ఎనిమిదింటికి వచ్చాడు. యస్.వి. యూనివర్సిటీ సెనేట్ హాల్‌లో షేక్స్పియర్ రచనలమీద ఉపన్యాసం యివ్వబోతున్నారుట. మీకు వీలయితే రమ్మన్నారు. ఉపన్యాసం పూర్తవగానే మిమ్మల్ని కలసి మాట్లాడుతారుట. ఈ విజిటింగ్ కార్డు మీకిమ్మన్నారు" అంటూ ఒక తెల్లనికార్డు తన చొక్కాజేబు నుంచి తీసి నాకిచ్చాడు. మళ్లీ వెనక్కి తిరిగి "మీకు వీలులేక మీరు రాలేని పక్షంలో, తనే సాయంకాలం నాలుగు గంటలకు వచ్చి మాట్లాడుతారుట" అంటూ హాల్లోని మేజాసొరుగులోని తన హీరోహోండా బైక్ తాళం చెవులు తీసుకొని, "నేనటే వెళుతున్నాను, వస్తానంటే... మిమ్మల్ని డ్రాప్ చేస్తాను" అన్నాడు.

నాకూ అతనెవరో తెలుసుకోవాలని వుత్కంఠగా వుంది. వెంటనే అతనిచ్చిన విజిటింగ్ కార్డులోని పేరును చూచాను. డా॥ టి. నటరాజన్, యం.ఏ., పి.హెచ్‌డి., మద్రాస్ యూనివర్సిటీ, చెన్నై" అని వుంది. ఏమీ బోధపడలేదు. తనెవరో, ఎక్కడ పరిచయమయ్యాడో తెలియలేదు. నా చేతి గడియారం వంక చూచుకొన్నాను. టైము పదిన్నరయింది. ప్రకాశం "వెళదామా మాస్టరూ" అన్నాడు తన వాహనం తాళం తీస్తూ. నేను "సరే" అన్నాను. అతను బైక్ స్టార్ట్ చేసాడు. నేను అతని వెనుక కూర్చున్నాను. కొత్త వాహనం నున్నటి తారురోడ్డు మీద సర్రున దూసుకుపోతోంది.

హాల్లో జనం కిటకిటలాడుతున్నారు. ప్రెస్‌కి కేటాయించిన సీట్లలో ఒకటి, రెండు మాత్రమే ఖాళీగా వున్నాయి. ఇక ఆలస్యం చేస్తే అవి కూడా నిండిపోయే పరిస్థితి ఊహించి, ప్రకాశం వెనుక నేను త్వరగా లోపలికి వెళ్లాలని ద్వారం దాటి లోనికి వెళుతున్నాను. పట్టాభి లోపలి నుంచి వెలుపలికి వస్తున్నాడు. అతను నా సహోద్యోగి. నన్ను చూడగానే "మాస్టారూ, మీకోసమే చూస్తున్నాను. అన్నమాచార్య కళామందిరంలో మేడసాని మోహన్‌గారి అష్టావధానం జరుగుతోంది. అది నా పరిధిలోనిదైనా సాహిత్యంలో, సంస్కృతాంధ్ర భాషలలో మంచి ప్రవేశమున్న మీరు ఆ కార్యక్రమం కవర్ చేస్తే మంచి శీర్షిక తయారవుతుంది. ఈ షేక్స్పియర్ రచనల మీది వుపన్యాసాన్ని నేను కవర్ చేస్తాను. కాదనకండి మాస్టారూ..." అన్నాడు.

నేను లోపలికి వేయబోయే కాలిని వెనక్కి

తీసుకొన్నాను. ఒకరికొకరు సాయం చేసుకోక పోతే సభ్యతగా వుండదు. అందుకని "నటరాజన్ గారిని, నాల్గు గంటలకు యింటి దగ్గర కలవమను" అని ప్రకాశంకు చెప్పి, పట్టాభి వాహనం తీసుకొని నేను అన్నమాచార్య కళా మందిరానికి వెళ్లిపోయాను.

కళ్లుతెరచి చూచేటప్పటికి మగతగా వుంది. భోజనం చేసి పడుకున్నాను. అలాగే నిద్రపోయాను. చేతిగడియారం చూచాను, నాలుగు పదిహేనైంది. "నటరాజన్ గారిని రమ్మన్నాను. అతను వచ్చే సమయమయింది" అనుకుంటూ స్నానాల గదికెళ్లి ముఖం కడుక్కొని, బట్టలు మార్చుకొని దినపత్రిక తిరగేస్తూ సోఫాలో కూర్చున్నాను. యింతలో తలుపు చప్పుడైంది. ఓ కొత్త వ్యక్తిని తీసుకొని పట్టాభి వచ్చాడు. "ఏం పట్టాభీ నువ్వు వచ్చావు" అంటూ పలుకరించాను. అతని ప్రక్కన వున్నది నటరాజన్‌గారని వూహించాను". నన్ను క్షమించండి మాస్టారూ... మీరు నటరాజన్‌గారిని కలవటానికి వస్తున్నట్లు నాకు తెలియదు. మీ అవసరం తెలుసుకోకుండా, నా పని మీ కప్పగించినందుకు నన్ను క్షమించండి" అన్నాడు. "పరవాలేదు లేవోయ్, అప్పటికే పదకొండు గంటలైంది. ఇక మాట్లాడుతూ కూర్చుంటే కుదరదని వెళ్లిపోయాను" అన్నాను. అంతసేపూ మా సంభాషణ ఎప్పుడు ఆగుతుందా అని ఎదురుచూస్తున్న నటరాజన్ "మాస్టారూ" అంటూ నా కాళ్లమీద పడి నమస్కరించాడు. వెంటనే అతనిని లేవనెత్తి "ఎవరు మీరు?" అని ప్రశ్నించాను.

"నేను మాస్టారూ! నటరాజన్‌ని. నన్ను "నట్టూ" అని పిలిచేవారు. "మీరు నాకు పుస్తకాలు కొనిచ్చి మా నాన్నగారికి ధనసాయం చేసి, అంగడి పెట్టించారు. ఆయన పేరు సారంగపాణి. నేను చెన్నై నుంచి వస్తున్నాను" అన్నాడు.

"నేను, నట్టూని" అని అతడనగానే, చెన్నైలోని 'వల్లువరుకోట' గుర్తుకువచ్చింది. అప్పుడు జరిగిన విషయాలన్నీ సినిమా రీలులాగా నా కళ్లముందు తిరుగసాగాయి.

చెన్నైలో "వల్లువరుకోట" ఒకటుందని, అది చాలా బావుంటుందని, అధునాతనంగా నిర్మించినదైనా పురాతన శిల్ప కళారీతులు వుట్టిపడుతుందని నా స్నేహితులు చెప్పేవారు. నేను చెన్నై చాలాసార్లు వెళ్లాను. ఎప్పుడూ ఆ కోటను చూడలేదు. ఒకసారి చెన్నైకి వెళ్లినప్పుడు ఆ కోటను చూడాలని నా భార్య శకుంతలను, పిల్లలు రవి, రమణిలను తీసుకొని వెళ్లాను. వెళ్లిన మొదటి రోజు పూర్తిగా నా పనితోనే సమయం గడచిపోయింది. ఆవిడ, పిల్లలు హోటల్ గదిలోనే వుండిపోయారు. రాత్రి నేను రాగానే పిల్లలు "ఎందుకు ఆలస్యమయిందని" నిలదీసారు. "గదిలో వుండటానికైతే ఇంత దూరం రావాలా? ఇంట్లోనే వుండొచ్చుగదా" అని నా భార్య వంతపాడింది. నా పనుల తొందరలో ఆ రోజు కుదరలేదని వాళ్లకెలాగో నచ్చచెప్పి సముదాయించాను.

మరుసటిరోజు ఉదయం అందరూ త్వరత్వరగా తయారైపోయారు. తొమ్మిదింటికే ఒక ఆటో మాట్లాడుకొని మెరీనాబీచ్‌కి వెళ్లాము. ఆ రోజు ఎండ అంతగా లేదు. మేఘాలు క్రమ్ముకొని సూర్యకిరణాలు చాలా పల్చగావున్నాయి. నీలి రంగు సముద్రంలోని ఆటు పోటులు తీరాన్ని తాకడాన్ని పిల్లలు చాలా తృప్తిగా చూసారు. సుమారు ఒక గంటపైగా అక్కడ గడిపాం. పదకొండు గంటలకు అక్కడి నుంచి "వల్లువరు కోట"కు చేరుకున్నాము.

"వల్లువరుకోట" అంటే "తిరువల్లువరు"

అనే మహాత్ముని పేర నిర్మించిన కోటని అర్థం. ఆయన "తిరుకురల్" అనే గొప్ప గ్రంథాన్ని రచించాడు. అది మానవ సమాజానికి ఎంత గానో ఉపయోగపడే సూక్తులతో నిండివుంది. ఈ విషయాలన్నీ పిల్లలు చాలా శ్రద్ధగా తెలుసు

కున్నారు. అక్కడే రాతిరథానికి నఖలు అనిపించే విధంగా అధునాతనంగా, సిమెంటుతో నిర్మిం చిన రథం ఉంది. పిల్లలు, నా భార్య దాని చుట్టూ తిరుగుతూ ఆసక్తిగా చూచారు. అక్కడే ఒక చిన్న పిల్లవాడు... అతనికి ఏడు సంవత్స రాల వయస్సుంటుంది. మా వెంటబడి అడు



క్కుంటున్నాడు. నా అర్ధాంగి ఒక రూపాయి నాణెం వేసింది. వాడు వెళ్లలేదు. పిల్లల వెంట, నా వెంట పడ్డాడు. "చక్కగా వున్నావు ఏదైనా పని చేసుకోరాదా? లేదా చక్కగా చదువుకో రాదా?" అన్నాను నేను. "మా నాన్నకు ఒక కాలు లేదు, తనని కూడా నేనే పోషించాలి" అంటూ వచ్చీరాని తెలుగులో మాట్లాడాడు. వాడికో ఐదు రూపాయలు ఇచ్చి "మీ నాన్న ఎక్కడో చూపించు, మాట్లాడుతానని" అన్నాను. "రండి బాబూ" అంటూ రథానికి ఆవలివైపుకి తీసుకొని వెళ్లాడు.

"చదువు నేర్పించితే పిల్లలు ఎంతవరకైనా చదువగలరు. కేవలం మనం చేయవలసిం దల్లా వారికి ఆ అవకాశం యివ్వటం మాత్రమే". ఇది నా అభిప్రాయం. స్నేహితులతో చర్చించేట ప్పుడు ఎన్నిసార్లో ఈ విషయం ప్రస్తావనకొ చ్చింది. చిన్నపిల్లలు చదువుకోడానికి అవకాశం లేకనే... సోమరిపోతులుగా, దొంగలుగా, మోసగాళ్లుగా మారిపోతున్నారు. మనం చేతనైన సహాయంచేసి, ఒక్కొక్కరూ ఒకరికి చదువుకునే అవకాశం కల్పిస్తే, దేశంలోని ఎంతో మంది పిల్లలు చదివి గొప్పవారవుతారని నా అభిప్రాయం.

ఆ పిల్లవాడి తండ్రి వయసైన వాడేమీకాదు. నడివయస్సు వుంటుంది. ఒక కాలు లేదు. అతని దగ్గరకు వెళ్లాను. "వీడు నీ కొడుకా?" అన్నాను. "అవున"న్నాడు. కాలేమయింది? అన్నాను. అతను తెలుగులో బాగా మాట్లాడు తున్నాడు. "కాలికి దెబ్బ తగిలి, సెప్టిక్ అయింది. మోకాలు దాకా కాలు తీసేయాలన్నారు డాక్టరు. లేకుంటే ప్రాణానికి ప్రమాదమన్నారు. అట్లే తీయించేసుకొన్నాను.

"అయితే యిదేమిటి అడుక్కోవడం? ఏదైనా వ్యాపారం చేసుకొని పిల్లవాడిని చదివించరా దా?" అన్నాను. అతను మాట్లాడలేదు. "పెద్ద పెద్ద వ్యాపారాలు వద్దయ్యా... చిన్న ప్లాస్టిక్



ముంబయిలో జరిగిన శ్రీ అంబల్ల జనార్ధన్ గారి తెలుగు కథల మరాఠీ అనువాద సంపుటి "చిత్ ఆణి పట్" ఆవిష్కరణ సభలో శ్రీ అంబల్ల జనార్ధన్, శ్రీమతి గిరిజాకీర్, డా॥ ధనరాజ్ మాన్‌ధనే, డా॥ పిల్లలమర్రి రాములు, శ్రీసంగెవేణి రవీంద్ర.

సామానుల అంగడి లాంటిది పెట్టుకోలేవా?" అన్నాను.

"దానికైనా ఐదారువందలు కావాలిగా బాబూ, ఎవరిస్తారు?" అన్నాడతను.

ఆలోచించాను... అతను మంచివాడిలా వున్నాడు. విధిలేక బిక్షుక వృత్తిలోకి దిగినట్లున్నాడు. వెంటనే పర్సుతెరచి, ఆఫీసు పనికోసం తెచ్చిన డబ్బులో ఒక వెయ్యిరూపాయలు తీసి, "చిన్న షాపు పెట్టుకొని పిల్లవాడిని చదివిస్తానంటే, ఈ డబ్బు తీసుకో..." అన్నాను.

"దండాలు దొరా అంటూ నా కాళ్లు పట్టుకొని కళ్లకద్దుకున్నాడు. "అలాగే చదివిస్తా దొరా" అన్నాడు. అతని పేరు సారంగపాణి, అతని కొడుకు పేరు 'నట్టు'. నటరాజన్‌కు ముద్దుపేరు.

నా భార్య, నన్ను పక్కకు పిల్చి "అంత డబ్బు వాడికెందుకిచ్చావు, వాడు పిల్లవాడిని చదివిస్తావా? నాకేమీ నమ్మకం కలగటంలేదన్నది".

"మనం చేసే ప్రయత్నం మనం చేస్తాం ఫలితమాశించకుండా. వాళ్లు ఎలా చేసినా మనం బాధపడకూడదు. ఆ నిశ్చయం చేసుకొనే నేనా డబ్బును వాళ్లకు యిచ్చాను" అన్నాను. ఆవిడ మాట్లాడ లేదు. నేను పిల్లవాడిని దగ్గరకు పిలిచాను. వాడు వచ్చి నా దగ్గర నిలబడ్డాడు. వాడితో "చూసావుగా... మీ నాన్నకు డబ్బిచ్చాను. నీవు బాగా చదువుకోవాలి" అన్నాను. వాడికేం చెప్పాలో తెలియలేదు. వాడి కళ్లల్లో మాత్రం సంతోషం కొట్టొచ్చినట్లు కనిపిస్తున్నది. వాడిని తీసుకొని దగ్గర్లోని పుస్తకాల షాపుకు వెళ్లాం. వాడి చదువుకు కావలసిన పుస్తకాలు వగైరా తీసి ఇచ్చాను. "రేపే నట్టుని స్కూల్లో చేర్పించమని" వాళ్ల నాన్నకు చెప్పి, మేము మా గదికి తిరిగి వచ్చాము.

ఆలోచనా తరంగాల నుంచి తేరుకొని ఈ లోకంలోకి వచ్చాను. "మాస్టారూ, గుర్తుకొచ్చిందా?" అంటున్నాడు నటరాజన్. ఆ పిల్లవాడే ఇంతవాడయ్యాడన్న మాట. కలలాగా వుంది. ఎమ్.ఏ., పిహెచ్‌డి. చదివాడు. నాకు ఎంత మాత్రం నమ్మకం కలుగలేదు. ఆ రోజు వాళ్ల నాన్న సారంగపాణి వాలకం చూసినప్పుడు ఇతను ఈ పిల్లవాడిని చదివిస్తాడా? అని ఏ మూలనో అనుమానపడిన నేను పుస్తకాలు కొనియిచ్చి వాడిలో చదువుకోవాలనే జిజ్ఞాసను పురికొల్పాను. నేనొక చిన్నరాయి విసిరాను. అది ఏకంగా పెద్ద పర్వతాన్నే పొడిగా చేసింది. నా కన్నులు ఆనందంతో నిండిపోయి, కొసల్లో నీళ్లను చిమ్మాయి.

* * *

మరునాడు సుందరం మాస్టారు యింటిల్లిపాదికీ హోటల్‌లో డిన్నర్ యిచ్చాడు నటరాజన్.. డిన్నర్‌కి ప్రకాశం, పట్టాభిలను కూడా పిలిచారు. మాస్టారుగారి భార్య తను అనుమానించినట్లు కాకుండా ఆ పిల్లవాడు చదువుకొని అంత ఎత్తుకు ఎదిగినందుకు బాగా సంతోషించింది. అప్పుడు చెప్పాడు నటరాజన్... "మాస్టారూ, మీరిచ్చిన డబ్బుతో చిన్న ప్లాస్టిక్ సామాన్ల షాపు పెట్టుకొన్నాం. అదే అంతకంతకూ పెరిగి పెద్ద బట్టల దుకాణమైంది. మా నాన్నగారు మీ అందరినీ చూడాలంటున్నారు. మీరు, మీ కుటుంబసభ్యులూ ఒకసారి చెన్నైకి రావాలి. నేను చదువుకొని యింత వాడినయ్యానంటే, అది మా యింట మీరు వెలిగించిన దీపమే" అన్నాడు. సుందరం మాస్టారు సంతోషంతో వుబ్బితబ్బిబ్బవుతూ నటరాజన్‌ను గుండెకు హత్తుకున్నాడు. ప్రకాశం, పట్టాభిల కళ్లు ఆనందభాష్పాలతో నిండిపోయాయి.

"ఒక దీపం వెలిగింది" పట్టాభి మెల్లగా అన్నాడు. ●